క్లుప్తంగా

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ముగ్గురు విద్యార్థినులు ఎంపిక



రాజుపాలెం: మండలంలోని గణపవరం జిల్లా పరిషత్ పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్లు హెచ్ఎం సుగుణమ్మ శుక్రవారం తెలిపారు. ఈ పోటీలు 25, 26 తేదీలలో పెనుమాక జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగినట్లు తెలిపారు. అండర్ 17 ఏళ్ల లోపు స్థాయిలో కృష్ణవిజ్ఞశ్రీ , అండర్ 14 ఏళ్ల లోపు పొట్లపాటి మహిమ కుమారి, వేల్పుల విజయలక్ష్మిలు ఎంపికైనట్లు తెలిపారు. 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పీడీ జె.రమణమ్మ, విద్యాకమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

పంచారామాల పర్యటనకు ప్రత్యేక బస్సు

సత్తెనపల్లి: కార్తిక మాసం సందర్భంగా పంచారామాల క్షేత్రాల దర్శనం కోసం పట్టణంలోని ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 3, 10, 17, 24 తేదీలలో ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బస్సు ఏర్పాటు చేయడమైందని సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో నుంచి బయలు దేరి సామర్లకోట, ద్రాక్షరామం, పాలకొల్లు, భీమవరం, అమరావతి దేవాలయాల దర్శనం చేసుకొని తిరిగి సోమవారం ఉదయం సత్తెనపల్లి డిపోకి ప్రత్యేక బస్సు చేరు కుంటుందన్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సుచార్జి కేవలం రాను పోను రూ.950 మాత్రమేనన్నారు. ఇతర వివరాలకు 9959225429, 7382896966 ఫోన్ నెంబర్లను సంప్రదించగలరన్నారు.

కార్మిక హక్కుల సాధనకు ఏఐటీయూసీ కృషి

పెదకూరపాడు: కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటాలు చేసిన సంఘం ఏఐటీయూసీ అని సీపీఐ పెదకూరపాడు నియోజకవర్గ కార్యదర్శి, ఏఐటీయూసీ అధ్యక్షుడు మునుగోటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తేళ్ల ప్రసాద్ ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు. సంఘం నాయకుడు షేక్ నాగూల్‌మీరా, పలువురు నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

సత్తెనపల్లి: వ్యక్తి అదృశ్యంపై సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి... సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామానికి చెందిన రైతు పోలినేని వేణు మూడు నెలల క్రితం కొండపల్లి వెళ్లి అక్కడ నివసిస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 29న ఫణిదం గ్రామానికి తిరిగి వచ్చాడు. తనకు కొంత అప్పులు కావడం ఆ అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో గత నెల 30న అదృశ్యమయ్యాడు. దీనిపై ఎక్కడ వెతికినా సమాచారం లభించకపోవడంతో వేణు భార్య లావణ్య శుక్రవారం సత్తెనపల్లి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...చిలకలూరిపేటకు చెందిన మంద్రు తిరుమల కిషోర్, భావనారుషినగర్ వాసి కుమ్మరిగుంట లీలాకృష్ణ స్నేహితుడితో కలిసి టీ తాగేందుకు శుక్రవారం బయలు దేరారు. నరసరావుపేట సెంటర్ నుంచి టీడీపీ కార్యాలయం వద్ద కేపీ రెస్టారెంట్ వైపు మలుపు తిప్పుతుండగా, అదే సమయంలో నరసరావుపేట నుంచి వేగంగా వస్తున్న బైక్ వీరి స్కూటీని ఢీ కొట్టింది. దీంతో స్కూటీపై ఉన్న ఇద్దరూ కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో లీలాకృష్ణ(30)కు తీవ్రగాయాలు కాగా పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి వెంబడి నుంచి రైల్వే స్టేషనుకు వెళ్లే రహదారి మార్గంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారించాలని సీపీఎం మండల కార్యదర్శి కె.వి.ఆర్. మోహన్ చందు స్థానిక ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావుకు శుక్రవారం విన్నవించారు. ఈ రహదారిలో వ్యాపారులు ఇష్టానుసారంగా ఆక్రమణలు చేయటం వల్ల ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పండుగల సందర్భంగా వ్యాపారస్తు లు రోడ్డుపై అమ్మకాలు చేస్తున్నారని తద్వారా ఆటోలు బైకులు రాకపోకలు తీవ్ర అంతరా యం వాటిల్లితుందన్నారు. ఉదయం 8 నుంచి 10 గంటల, సాయంత్రం 4 నుంచి 6 గంటల సమయంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటుందన్నారు. సత్వరమే ట్రాఫిక్ సమస్యను పరిష్కారించాలన్నారు.

కార్తిక మాసం... శుభకరం!



పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లో గల శివాలయం



పట్టణంలోని సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం వద్ద శివుడి విగ్రహం

శివునికి ప్రీతికరమైనది కార్తిక మాసం. శుభకరమైన కార్తిక మాసం ప్రతి ఏటా దీపావళి మరుసటి రోజు నుంచి ప్రారంభం అవుతుంది. హరిహరాదులకు ప్రీతి పాత్రమైన ఈ మాసంలో భక్తులు నియమ నిష్ఠలతో చేసే నోములకు ఎంతో ప్రాధాన్యం ఉంది. శివ పార్వతుల అనుగ్రహం కోసం మహిళలు ప్రత్యేక పూజలు చేస్తుంటారు. భారతీయ సంస్కృతిలో కార్తిక మాసం అంటే నెలరోజుల పాటు పండుగ దినాలే. ఈ మాసంలో దీపారాధనకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. దీపారాధనతో శుభ ఫలితాలతో పాటు ఆరోగ్య భాగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. ఈమేరకు కార్తిక మాస పూజలకు సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. అమరావతిలోని అమరేశ్వరస్వామి ఆలయంలో పాటు అమరావతి, సత్తెనపల్లి టౌన్, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు, పెదకూరపాడు, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాల్లోని శైవక్షేత్రాల్లో శనివారం తెల్లవారు జామున 5 గంటల నుంచే అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వ హించనున్నారు.

– సత్తెనపల్లి

అంబరం.. దీపావళి సంబరం



పరివర్తన పాఠశాలలో వేడుకల్లో జిల్లా ఎస్పీ సతీమణి కంచి కుమారి, పట్టణ ఎస్ఐ సంధ్యారాణి



రాజుపాలెంలో బాణసంచా వెలుగులు



క్రోసూరులో బాణసంచా దుకాణాల వద్ద సందడి

సత్తెనపల్లి: వెలుగుల పండుగ దీపావళి సంబరం సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో అంబరమంటింది. చీకట్లు పారదోలి వెలుగులకు స్వాగతం పలుకుతూ గురువారం ప్రతి ఇంట దీపాలు వెలిగించారు. ప్రత్యేక పూజలతో లక్ష్మీదేవిని ఆహ్వానించారు. సాయంత్రం నుంచి చిన్న, పెద్ద అందరూ కలిసి బాణా సంచా పేల్చుతూ సందడిగా గడిపారు. పట్టణంలోని పరివర్తన చెవిటి, మూగ, మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సతీమణి కంచి కుమారి ఆధ్వర్యంలో దీపావళి పర్వదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. 30 మంది మానసిక వికలాంగులకు ఆమె స్వయంగా టపాసులను అందించి వారితో వాటిని కల్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఆమెతో పాటు పట్టణ ఎస్ఐ ఎం .సంధ్యారాణి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను దీపావళి పండుగ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఇళ్ల ముందు దీపాలు వెలిగించి, టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు.

క్రోసూరులో...

క్రోసూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఆనందోత్సవాల నడుమ గురువారం దీపావళి వేడుకలు నిర్వహించారు. మండలంలో అనేక గ్రామాల్లో దీపావళి మందుల స్టాల్స్ ఏర్పాటు చేశారు. దీపావళి వెలుగులు స్వాగతిస్తు ప్రజలు ఇళ్ల ముందు దీపాలు వెలిగించారు. అర్ధరాత్రి వరకు టపాసులు కాల్చి పిల్లలు, పెద్దలు, మహిళలు సంబరాలు నిర్వహించారు.

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాలలో దీపావళి పండుగను గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఇంటిముందు మహిళలు రంగవల్లులు దిద్ది వాటిల్లో ప్రమిదలను వెలిగించారు. యువకులు, పిల్లలు టపాసులు కాలుస్తూ కేరింతలు కొట్టారు.

ఆదర్శప్రాయుడు పొట్టి శ్రీరాములు

ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం



సత్తెనపల్లిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

సత్తెనపల్లి: ప్రపంచంలో తెలుగు మాట్లాడేవారు ఎక్కడ ఉన్నా, తెలుగుజాతి ఉన్నంత కాలం వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే మహనుభావుడు, ఆదర్శ ప్రాయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వరరావు అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా పట్టణ ఆర్య వైశ్య సంఘం, యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ చౌక్ లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఉన్న జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలను, సేవలను పలువురు కొనియాడారు. పొట్టి శ్రీరాములు పేరు మీద రాజధాని అమరావతిలో స్మృతివనం గాని, మరేదైనా భవిష్యత్ తరాలకు గుర్తు ఉండేలాగా ఒక మంచి ప్రాజెక్టుకు ఆయన పేరు పెట్టేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, ఆర్యవైశ్య నాయకులు దేవరపల్లి కాశీ, చిల్లంచర్ల కళ్యాణ్, చాట శ్రీనివాసరావు,దూపగుంట్ల జానకీ రామారావు, సింగరి మధుసూదనరావు, కొత్త లక్ష్మయ్య, కాపుగంటి రత్తయ్య, అనుమాలశెట్టి వెంకటేశ్వర్లు, పెండ్యాల కాశీ మల్లేశ్వరరావు, జమిలి రాధాకృష్ణమూర్తి, యక్కల సతీష్, బొగ్గవరపు రవితేజ, కొత్తూరి విశ్వేశ్వరరావు, మద్ది అమర్, దేవరశెట్టి రామకృష్ణ, బచ్చు రామ సుబ్బారావు, చేపూరి నాగేశ్వరరావు, బాలనాగు శివకోటేశ్వరరావు, తదితరులు పాల్గొ న్నారు.

అమరజీవికి ఘననివాళి

రాజుపాలెం: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి, నాయకులు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వృద్ధులకు పింఛన్‌లు పంపిణీ చేశారు. అదేవిధంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గుంటూరు పట్టణంలోని ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శిబిరాన్ని ప్రారంభించారు.

బెల్లంకొండ: ప్రత్యేక రాష్ట్రం పోరాట సాధకుడు, అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలలో ఘనంగా జరిగాయి. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వై.హనుమారెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకు ప్రాణాలకు సైతం తెగించి ఆమరణ నిరాహార దీక్షకు కూర్చున్న యోధుడు పొట్టి శ్రీరాములు అని ఆయన కొనియాడారు. మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ షేక్ అష్రఫున్నీసా బేగం శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. మండలంలోని వెంకటాయపాలెం, మన్నెసుల్తాన్‌పాలెం, పాపాయపాలెం, మాచాయపాలెం, నాగిరెడ్డిపాలెం, చంద్రాజుపాలెం, వన్నాయపాలెం, కందిపాడు గ్రామాలలో సచివాలయాలలో సర్పంచ్‌లు, సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు.

ముప్పాళ్ళ: మండల కేంద్రమైన ముప్పాళ్లలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల శాఖ అధ్యక్షుడు అనుమాలశెట్టి శ్రీనివాసరావు, పల్లబోతు కోటేశ్వరరావు, శ్రీరాం జగన్, బొండా వెంకటేశ్వరరావు, గ్రంధి వీర కుమార్, తాడేపల్లి కోటిలింగం, పొట్టి రామకృష్ణ, అనుమాలశెట్టి వెంకటేశ్వర్లు, శ్రీరంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పిడుగురాళ్ల: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలోని రైల్వే ఫ్లై ఓవర్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సరావుపేటకు చెందిన మల్లెల వీరాంజనేయులు(35) పిడుగురాళ్ల పట్టణంలోని కుమ్మరిపాలెంలో తన అత్తవారింటికి దీపావళి సందర్భంగా వచ్చి మళ్లీ ఉదయం 4 గంటల సమయంలో తిరిగి నర్సరావుపేట వెళ్తుండగా రైల్వే ఫ్లై ఓవర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో వీరాంజనేయులు(35) అక్కడిక్కడే మృతి చెందాడు. ఈవిషయాన్ని గుర్తించిన మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించటంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

ఉక్కు మహిళ ఇందిరాగాంధీ

సత్తెనపల్లి: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 40వ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఎన్జీఓ హోం సెంటర్‌లో ఇందిరా గాంధీ విగ్రహానికి, గాంధీ చౌక్‌లో ఇందిరా గాంధీ విగ్రహానికి, నాగన్నకుంట ఏరియాలో ఇందిరా గాంధీ విగ్రహానికి, వడవల్లి ఇందిరా గాంధీ విగ్రహానికి, రైల్వే గేట్ సెంటర్లో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త చుక్కా చంద్రపాల్ హాజరుకాగా, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ బొక్క చిన్న గురు, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి మాదంశెట్టి వేదాద్రి, కాంగ్రెస్ నాయకులు షేక్ చాంద్ భాషా, పట్టణ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్ పాల్ హజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ ఉక్కు మహిళగా పేరుగాంచారన్నారు.

గ్యాస్ సిలిండర్ల పంపిణీ

సత్తెనపల్లి: ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కచ్చితంగా అమలు చేయడం జరుగుతుందని సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని వెంగళరెడ్డినగర్ 14వ వార్డు సచివాలయం మహిళలకు వంట గ్యాస్ సిలిండర్లు పంపిణీ కార్యక్రమంలో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై సిలెండర్లను పంపిణీ చేశారు. సత్తెనపల్లి ఆర్డీఓ గాజులపల్లి వెంకట రమాకాంతరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి యువకుడు మృతి

నకరికల్లు: మండలంలోని కుంకలగుంట గ్రామంలో సమీపంలో కాలువలో జారిపడి యువకుడు మృతిచెందాడు. అదేగ్రామానికి చెందిన వెంకయ్య(20) ఈతకు వెళ్లి జారిపడి మృతిచెందాడు. ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

వాలీబాల్ జట్టుకు సొలస విద్యార్థినులు



నాదెండ్ల: యడ్లపాడు మండలం సొలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురు క్రీడాకారులు గుంటూరు జిల్లా నుంచి రాష్ట్ర వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యారు. ఉన్నత పాఠశా లలో తొమ్మిదో తరగతి చదువుతున్న వెంగళశెట్టి ఐశ్వర్య, జె మేరి సునీతలు శుక్రవారం మంగళగిరి నియోజకవర్గం నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో జరిగిన అండర్ 14 బాలికల విభాగం పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు తరపున ఆడారు. చక్కటి ప్రతిభ చూపిన ఇరువురినీ రాష్ట్రజట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం వెంకట కృష్ణమాచారి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రజట్టుకు ఎంపికకావటం సంతోషకరమన్నారు. వీరికి శిక్షణనిచ్చిన పీఈటీ కారసాల మధు, ఉపాధ్యాయులను అభినందించారు.

ఉద్యోగ విరమణ ఓ గొప్ప అవకాశం

ఎస్పీ శ్రీనివాసరావు – ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ వెంకయ్య దంపతులకు సన్మానం

నరసరావుపేట: ఉద్యోగ విరమణ అనేది జీవితంలో మన కోసం మనం గడపడానికి వచ్చిన అవకాశంగా భావించి, కుటుంబం, బంధుమిత్రులతో కలిసి సుఖ సంతోషాలతో, ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా పోలీసు విభాగంలో పనిచేస్తూ అక్టోబరు 31తో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ అట్ల వెంకయ్య ఉద్యోగ విరమణ పొందారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వెంకయ్య దంపతులను ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఉద్యోగ విరమణ ఎదుర్కోవలసిన ఘట్టమన్నారు. ఇప్పటి వరకు ప్రజలకు సేవ చేయటంలో తనమునకలై అహర్నిశలు శ్రమిస్తూ ఒక్కసారిగా ఉద్యోగ విరమణ పొందటం కొంచెం బాధ కలిగిస్తుందన్నారు. పోలీస్ శాఖలో ఇన్ని రోజులు సేవలందించడానికి వారికి సహకరించిన కుటుంబ సభ్యులు, బంధు మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏ అవసరం వచ్చినా పోలీస్ శాఖ తరపున మా వంతు సహాయాన్ని అందిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు. మిగిలిన శేష జీవితం ఆరోగ్యంపై దృష్టి సారించి ఆహ్లాదకరంగా గడపాలని తోటి ఉద్యోగులు కాంక్షించారు. అదనపు ఎస్పీ జేవీ సంతోష్ పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోండి

వైఎస్సార్ సీపీ నేత పి.గౌతంరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న పి.గౌతంరెడ్డి

క్రోసూరు: పట్టభద్రులందరూ కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలని వైఎస్సార్ సీపీ నేత పి.గౌతమ్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం క్రోసూరు పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గతంలో కంటే మరింత ఉత్సాహంగా పార్టీని బలోపేతం చేద్దామన్నారు. పార్టీపై, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై ప్రజల్లో చెక్కుచెదరని విశ్వాసం ఉందన్నారు. డిగ్రీ చదివినవారంతా తప్పక ఓటు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం గౌతంరెడ్డిని పార్టీ నాయకులు, దుశ్శాలువాతో కప్పి ఘనంగా సత్కరించారు. క్రోసూరు ఎంపీపీ పి.కోటయ్య, బెల్లంకొండ ఎంపీపీ పద్మావెంకటేశ్వరరెడ్డి, క్రోసూరు జెడ్పీటీసీ షేక్ గఫూర్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గార్లపాటి దాసు, క్రోసూరు మండల కన్వీనర్ వెలది అప్పారావు, బెల్లంకొండ నాయకులు మర్రిప్రసాదరెడ్డి, సాయిరెడ్డి, క్రోసూరు వైస్ ఎంపీపీ విప్పల వెంకట్రామిరెడ్డి, షేక్ అబ్దుల్ ఖాదర్, అనుముల కోటిరెడ్డి, పాశం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో...

అమరావతి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జగన్నకు మద్దతుగా నిలవాలని వైఎస్సార్ సీపీ నేత పి.గౌతంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మెయిన్ రోడ్డులోని అతిథి గృహంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి పార్టీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త, నాయకుడు తమ గ్రామంలోని పట్టభద్రులను గుర్తించి వారిచేత ఓటుకు దరఖాస్తు చేయించాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు కోట హరిబాబు, అళ్ల శ్రీనివాసరెడ్డి, నాయుడు రాంబాబు, అలా లక్ష్మీనారాయణ, షేక్ హాష్మీ, వీరరాఘవయ్య, చిల్కా సాంబయ్య, పలుకూరి రోశిబాబు, తోకల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో అంతరపంటల పరిశీలన



అంతర పంటలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్, అధికారులు

రాజుపాలెం: మండలంలోని రెడ్డిగూడెంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పత్తి పంటలో అంతర పంటలను సీనియర్ థిమాటిక్ లీడ్ ట్రాన్స్‌ఫర్మేషన్ గోపీచంద్, ఎనార్వో యూనిట్ శ్రీనివాస్, పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారిలు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన రైతు ప్రణతికి చెందిన పత్తి పంటలో అంతర్ పంటలుగా గోరు చిక్కుడు, పెసర సజ్జ, బొబ్బర్లు, చెట్టుచిక్కుడు, కంది , కంచె పంటగా బెండ వైయడం జరిగిందని, అంతర పంటల వలన ప్రధాన పంటకు వచ్చే తెల్లదోమ, పచ్చదోమ, పేనుబంక, పిండినల్లి, గులాబీరంగు పురుగులను పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. ప్రకృతి రైతు గుర్రాల మల్లికార్జునరావు, జిల్లా అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజు, ఎన్ఎఫ్ ఎ.నందకుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బెల్లంకొండ: ప్రకృతి వ్యవసాయ విధానంలో వరి పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి తెలిపారు. శుక్రవారం మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పండిస్తున్న వరి పొలాలను పొలాలను పలువురు బృంద సభ్యులతో కలసి పరిశీలించారు. ఆమె వెంట ట్రాన్స్‌ఫర్మేషన్ తిమ్మటిక్ లీడ్ గోపీచంద్, ఎన్ఆర్ఓ యూనిట్ డిమాటిక్ లీడ్ శ్రీనివాస్, ఆడిషినల్ డీపీఎం ప్రేమ్ రాజ్, నందుకుమార్, అనంతలక్ష్మి, జయలక్ష్మి, అంజలి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్య ద్వారానే సమాజంలో గౌరవం



నిత్యావసరాలు అందుకున్న బాలబాట ఆర్గనైజర్లతో కార్డ్స్ డీడీ అమర్నాథ్, సుబ్బారావు, పుల్లారావు

సత్తెనపల్లి: సమాజంలో విద్య లేకపోతే గౌరవం ఉండదని నేటి సమాజంలో విద్య ప్రధాన మైనదని కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ అమర్నాథ్ అన్నారు. పట్టణంలోని ఎన్జీవో హోం సెంటర్‌లో ఏర్పాటు చేసిన బాలబాట డెవలప్‌మెంట్ ఆర్గనైజర్ల నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమంలో గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి సత్తెనపల్లి ఏరియా కో-ఆర్డినేటర్ సిహెచ్ పుల్లారావు అధ్యక్షత వహించారు. అమర్నాథ్ మాట్లాడుతూ బాలబాటల ద్వారా గురుకుల పాఠశాలను అజెండాగా చేసుకుని పిల్లలకు శిక్షణ ఇచ్చి పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నామన్నారు. పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్ డిప్యూటీ డైరెక్టర్ జి.సుబ్బారావు మాట్లాడుతూ ఆటపాటలతో చదువు, పెరటి తోటల పెంపకం, పచ్చదనం పరిశుభ్రత, స్వయం సహాయక జీవన విధానం నాలుగు అంశాలతో బాలబాటలు ద్వారా పనిచేస్తున్నామన్నారు. బాలబాట ఆర్గనైజర్లకు రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలు పంపిణీ చేశారు.

తరగతి గదులకు వెళ్లే దారేది!?



బెల్లంకొండ జడ్పీ పాఠశాల మైదానంలో నిలిచిన వర్షపు నీరు



చెట్ల కింద కూర్చోపెట్టి పాఠ్యాంశాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

- జడ్పీ పాఠశాల మైదానంలో నిలిచిన వర్షపు నీరు
- తరగతి గదులకు వెళ్లేందుకు దారి కరువు
- చెట్ల కిందనే తరగతులు

బెల్లంకొండ: మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మోకాళ్ల లోతు నీరు నిలిచిపోయింది. రెండు రోజులైన వర్షపు నీరు అలాగే నిలిచిపోయి ఉండడంతో శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు తరగతి గదులకు వెళ్లే దారి కరువైంది. పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులకు వెళ్లాలంటే ఆ బురద నీటిలోనే నడుచుకుంటూ వెళ్లాలి. దీంతో ఉపాధ్యాయులు నూతన తరగతి గదులను తెరవలేదు. పాత తరగతి గదులలో మాత్రమే ఉపాధ్యాయులు విద్యార్థులను కూర్చోబెట్టారు. మిగిలిన విద్యార్థులను మైదానంలోని చెట్ల కింద నీరులేని చోట కూర్చోబెట్టారు. అక్కడే పాఠ్యాంశాలను బోధించారు. వర్షం పడిన ప్రతిసారి ఇదేవిధంగా మైదానంలో రోజుల తరబడి నీరు నిలిచి ఉంటుంది. తరగతి గదులకు వెళ్లాలన్నా, విద్యార్థులు ఆటలాడుకోవాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి మైదానంలో నీటిని బయటకు పంపే విధంగా చూడాలని, వర్షపు నీరు మైదానంలో నిలవకుండా చర్యలు చేపట్టాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉల్లాస్‌పై అవగాహన

శావల్యాపురం: నేడు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై వెలుగు కార్యాలయం అధికారులు సిబ్బందితో ఉదయం 11 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సమాజంలో అందరి జీవితాల్లో నేర్చుకునే అభ్యసనాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. అలాగే స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులకు వయోజన విద్య ద్వారా అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా ప్రతి పది మంది మహిళలకు కలిపి ఒక్కో విద్య వలంటీర్ ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరు విద్య కల్గియుండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అనంతరం వెలుగు అధికారి ఏపీయం జి.వాసుబాబు సీసీలకు అక్షర వెలుగు పుస్తకాలు అందజేశారు.